

సాక్షి పల్నాడు

మంగళవారం । 21 । మార్చి । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 534.90 అడుగుల వద్ద ఉంది. ఇది 177.8698 టీఎంసీలకు సమానంగా ఉంది.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 44.2300 టీఎంసీలు ఉంది. ప్రాజెక్టు ఎగువ నుంచి 200 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

కోవిడ్ జీరో

గుంటూరుమెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఒక్క కరోనా పాజిటివ్ కేసు కూడా నమోదు కాలేదు. జిల్లాలో కరోనా మరణాలు ఎక్కడా సంభవించలేదు.



న్యూస్‌రీల్

పరమపదనాథుని అలంకారంలో నారసింహుడు



మంగళగిరి: నగరంలోని లక్ష్మీనృసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి పరమపదనాథుడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకోగా ఉత్సవాన్ని ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవానికి కైంకర్యపరులుగా ఆత్మకూరుకు చెందిన మురికిపూడి మాధవరావు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరికి చెందిన లంకా కృష్ణమూర్తి వ్యవహరించారు.

1,10,687 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,27,477 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,10,687 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.26,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ.27,000 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 90,378 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

దుర్గమ్మకు బంగారు ఆభరణాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దంపతులు బంగారు బొట్టు, నత్తు, బులాకీని సోమవారం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి వెంట మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆలయానికి విచ్చేశారు. మంత్రి నాగేశ్వరరావు దంపతులు 18 గ్రాముల బంగారంతో తయారు చేయించిన బొట్టు, నత్తు, బులాకీలను చైర్మన్‌కు అందచేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వదించగా, చైర్మన్ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను మంత్రికి అందజేశారు.

ఇంద్రకీలాద్రిపై చురుగ్గా ఉగాది ఏర్పాట్లు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది పర్వదినానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. వసంత నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని అమ్మవారికి తొమ్మిది రోజులు నిర్వహించే విశేష పుష్పార్చనకు లక్ష్మీ గణపతి ప్రాంగణంలోని యాగశాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. రాజగోపురం ఎదుట కళావేదికపై పంచాంగ శ్రవణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయానికి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఉగాది రోజు అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు గుడి ప్రాంగణంలో పుష్పాలతో అలంకరించాలని ఆలయ సిబ్బందిని అధికారులు ఆదేశించారు. పండుగ రోజు శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఉత్సవమూర్తులను వెండి రథంపై ఊరేగించనున్నారు. ఊరేగింపును అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఈవో భ్రమరాంబ, దేవస్థాన ఫెస్టివల్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాలకు మరో రోజు మాత్రమే ఉండటంతో ఆలయ అధికారులు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి డీబార్

కారెంపూడి: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న విద్యార్థిని డీబార్ చేసిన సంఘటన సోమవారం జరిగింది. వివరాల ప్రకారం.. స్థానిక ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సివిక్స్ పరీక్ష చివరి పదినిమిషాల ముందు ఓ విద్యార్థి కాపీయింగ్‌కు పాల్పడుతున్న వైనాన్ని సీసీ కెమెరాలో పరీక్ష కేంద్రం డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ గమనించారు. పరీక్ష హాల్‌కు వెళ్లి విద్యార్థిని పరిశీలించగా జవాబుల స్లిప్‌లు దొరికాయి. దీంతో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబార్ చేశారు. అంతకుముందు పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ చేసింది.

పౌష్టికం.. ఆరోగ్యదాయకం

నేటి నుంచి విద్యార్థులకు రాగి జావ పంపిణీ

- నేడు ప్రారంభించనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- విద్యార్థుల్లో రక్తహీనత, కాల్షియం లోపాలను తగ్గించడమే లక్ష్యం
- మంగళ, గురు, శనివారాల్లో అందజేత
- జిల్లాలో 1536 పాఠశాలల్లోని 1,68,490 మంది విద్యార్థులకు లబ్ధి

మహత్తర పోషక విలువలకు చిరునామా రాగి.. తృణధాన్యాల్లోకెల్లా రారాజుగా నిలిచిన రాగితో చేసిన వంటలు ఆరోగ్యప్రదాతలు అని చెప్పడంలో సందేహం లేదు.. విద్యార్థులకు అదనపు శక్తి, ఆరోగ్యం కోసం ప్రభుత్వ పాఠశాలల్లో నేటినుంచి రాగిజావను ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే విద్యార్థుల మెనూపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ.. వారికి పౌష్టికాహారం అందిస్తున్న ప్రభుత్వం, అదనపు శక్తి అందేందుకు, తద్వారా చదువుపై మరింత ఏకాగ్రత నిలిపేందుకు ఇకనుంచి ఈ బలవర్థక పానీయాన్ని ఇవ్వనుంది.



సాక్షి, నరసరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కార్యక్రమం జగనన్న గోరుముద్ద. విద్యార్థులకు మెరుగైన పోషకాలను అందించడంతోపాటు, డ్రాపౌట్లను తగ్గించే కార్యక్రమాల్లో భాగంగా వారికి స్కూల్‌లోనే రుచికరమైన పౌష్టికాహారాన్ని మధ్యాహ్న భోజనంలో అందిస్తోంది. రోజువారీ అందిస్తున్న మెనూతో పాటు పిల్లల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించడానికి వారంలో 5 రోజులు గుడ్డు, మూడు రోజులు బెల్లం, పల్లీ చిక్కీ ఇస్తున్నారు. పిల్లలకు ఐరన్, కాల్షియం లోపాలు లేకుండా నివారించడానికి మరో ముందడుగు వేసి రాగి జావ అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బెల్లం, పల్లీ చిక్కీ ఇవ్వని రోజుల్లో పిల్లలకు తగినంత ఐరన్, కాల్షియం అందించేందుకు వీలుగా చిరుధాన్యాలను మధ్యాహ్న భోజన పథకంలో భాగం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే జగనన్న గోరుముద్దలో రాగిజావ అందించేందుకు సీఎం నిర్ణయం తీసుకున్నారు. దీంతో మధ్యాహ్న భోజనంలో చిక్కీ ఇవ్వని రోజుల్లో అందుకు బదులుగా రాగిజావను మెనూలో చేర్చుతూ నిర్ణయం తీసుకున్నారు. వారానికి మూడు రోజుల పాటు రాగిజావను మిడ్ డే మీల్స్‌లో భాగం చేశారు. శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు జగనన్న గోరుముద్ద పిల్లలకు రాగిజావ అందించే కార్యక్రమంలో ప్రభుత్వంతో భాగస్వామి అయింది. ఈ కార్యక్రమాన్ని నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. నరసరావుపేటలోని మున్సిపల్ పాఠశాలల్లో జరిగే జిల్లా స్థాయి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

వారమంతా పోషకాహారం..

పల్నాడు జిల్లాలో ప్రస్తుతం 1,536 ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం విజయవంతంగా అమలవుతోంది. జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు జిల్లాలో 1,68,490 మంది విద్యార్థులు గోరుముద్ద పథకంలో మధ్యాహ్నభోజనం పథకంతో భోజనం చేస్తున్నారు. జగనన్న గోరుముద్దలో భాగంగా ప్రస్తుతం వారంలో మూడు రోజుల పాటు చిక్కీని అందిస్తున్నారు. ఇది సోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు అందుతున్నాయి. మిగిలిన మూడు రోజులైన మంగళ, గురు, శనివారాల్లో రాగిజావను ఇక నుంచి పంపిణీ చేయనున్నారు. దీని ద్వారా వారమంతా బడిలో బలవర్థక ఆహారం విద్యార్థులకు అందనుంది.

రాగి జావతో ప్రయోజనాలెన్నో..


రాగిజావలో తక్కువ కొలెస్ట్రాల్, సోడియం ఉంటుంది. బి కాంప్లెక్స్, విటమిన్ సి, ఈ, రిబోఫ్లోవిన్, నియాసిన్, ఫోలిక్ యాసిడ్, కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. మనిషిలోని పోషకాహార లోపాల్ని నివారించడానికి రాగి జావ సహాయకారిగా ఉంటుంది. అంతేకాకుండా శరీరంలో వివిధ భాగాలకు ఆక్సిజన్ సరఫరా చేయడంలో ఉపయోగపడుతుంది. దీంతో మానసిక ఆందోళన, నిద్రలేమి సమస్యలు తగ్గుతాయి. ఎముకలు గట్టిపడటానికి, గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించడానికి రాగిజావ ఉపకరిస్తుంది.

రక్తహీనత సమస్యను తగ్గించవచ్చు



నేటి నుంచి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ రాగి జావ అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. నాణ్యతలో రాజీ లేకుండా చేయాలని జగనన్న గోరుముద్ద వంట మనిషి, సహాయకులకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చాం. హెచ్‌ఎంలు, ఎంఈఓ, డీఈఓ కార్యాలయం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించాం. రాగిజావ ఎంతో ఆరోగ్యకరం. ముఖ్యంగా జిల్లాలో విద్యార్థినులు రక్తహీనతతో బాధపడుతున్నారు. రాగిజావ వల్ల రక్తహీనత సమస్యను తగ్గించవచ్చు.

– శివశంకర్ లోతేటి, పల్నాడు జిల్లా కలెక్టర్



శ్రీసత్యసాయి ట్రస్ట్ ప్రభుత్వ పాఠశాలలకు రాగి జావ కోసం సరఫరా చేస్తున్న రాగిపిండి బస్తా

హ్యాండ్‌బాల్ రాష్ట్ర జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పి.సత్యనారాయణరాజు తెలిపారు. ఇటీవల నిర్వహించిన పోటీల్లో కె.రూప, యు.తులసి, కె.తేజస్విని, కె.సలోని, డి.ఇందిర, పి.వెంకటశైలజ, పి.దుర్గాదేవి, ఎం.స్వాతి, కె.శ్రీవిద్య, టి.అరుణ, ఎ.హారిక క్రీడా నైపుణ్యం ప్రదర్శించి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 22 నుంచి 26వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లోని బరేలీలో జరిగే 45వ జాతీయ పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఎంపికైన క్రీడాకారులను కోచ్ బాల, అసోసియేషన్ ప్రతినిధులు ఎం.డి.నాగేంద్రకుమార్, పి.విజయ్‌కుమార్ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం వద్ద సోమవారం అభినందించారు.

నేడు ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జాబ్ మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9.30 గంటలకు గుజ్జనగుండ్ల సెంటర్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మెక్ డోనాల్డ్స్, డీ-మార్ట్, యాక్సిస్ బ్యాంకులో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్న జాబ్‌మేళాకు టెన్త్ ఆపై విద్యార్హతలు గల నిరుద్యోగ యువతీ, యువకులు హాజరు కావాలని సూచించారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల అభ్యర్థులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతలు, ఆధార్ జిరాక్స్ కాపీలతో పాటు పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో సాయంత్రం 4.00 వరకు జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలని తెలిపారు.

అంతరాష్ట్ర గంజాయి సరఫరా ముఠా అరెస్ట్

- 140 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: గంజాయి సరఫరా చేస్తూ రూ.లక్షలు గడించే అంతరాష్ట్ర గంజాయి సరఫరా ముఠాను బాపట్ల జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ వకుల్‌జిందాల్ వెల్లడించారు. రంపచోడవరం ప్రాంతానికి చెందిన బుజ్జి ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దులలోని ఏజెన్సీ ప్రాంతం నుంచి తన అనుచరుల ద్వారా పెద్ద మొత్తంలో గంజాయి సప్లయి చేయించుకొని, తన ఏజెంట్‌ల ద్వారా పలు ప్రాంతాలకు, ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తూ అక్రమ సంపాదనకు అలవాటు పడ్డాడు. బుజ్జి తనకు సహకరించేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, వెలగలపాలెం గ్రామానికి చెందిన గంజాయి కేసుల్లో పాత నేరస్తుడైన వేమలపూడి గవాస్కర్ అలియాస్ తేజను నియమించుకున్నాడు. బుజ్జి ఆదేశాల ప్రకారం గవాస్కర్ అల్లూరి సీతారామరాజు జిల్లా, కొయ్యూరు మండలం, కొండసంత గ్రామానికి చెందిన కర్రిదారబాబు, నర్సీపట్నంలోని అయ్యన్నపాలెం ఏరియాలో కామన్ సర్వీస్ సెంటరు నడిపే లగిజే ఈశ్వర వరప్రసాద్‌ను ఈనెల 18న వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఏరియాకు దగ్గర్లోని అడవుల్లో కలిసి చెన్నై తరలించాల్సిందిగా రూ.30వేలు ఇచ్చి, గంజాయి బస్తాలను అప్పగించాడు. గవాస్కర్, కర్రిదారబాబు, ఈశ్వర ప్రసాద్, గంజాయి తీసుకుని బాడుగ కారులో చెన్నై బయల్దేరారు. ఈనెల 19న మధ్యాహ్నం 3 గంటల సమయంలో మార్టూరు సీఐ షేక్.టి.ఫిరోజ్, మార్టూరు ఎస్ఐ కమలాకర్ వారి సిబ్బంది కలసి మార్టూరు ఇంచార్జి తహసీల్దార్ బి.వెంకటరెడ్డి సమక్షంలో బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు తనిఖీలు చేయడం చూచి, తమ కారుని వెనుకకు మళ్లించుకొని పారిపోయేందుకు యత్నించారు. సీఐ వారి సిబ్బంది చాకచక్యంగా నిందితులను పట్టుకొని వారిని క్షుణ్ణంగా విచారించి కారులో అక్రమంగా తరలిస్తున్న 4 తెల్లని ప్లాస్టిక్ గోతాల్లో 140 కిలోల గంజాయిని, అక్రమ రవాణాకు ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, స్వాధీనం చేసుకున్న గంజాయి



సీఐ ఫిరోజ్‌ను అభినందిస్తూ ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ

మార్టూరు పోలీసులకు ఎస్పీ ప్రశంసలు...

మార్టూరు: గంజాయి అక్రమ రవాణలో నిందితులను చాకచక్యంగా పట్టుకున్న మార్టూరు పోలీసులను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు. ఎస్పీ సోమవారం బాపట్లలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో స్థానిక అధికారులను అభినందిస్తూ ప్రశంసపత్రాలు అందజేశారు. మార్టూరు సీఐ ఎస్‌కేటీ ఫిరోజ్, ఎస్ఐ కమలాకర్, ఏఎస్ఐ సైదా, హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, ప్రసాద్, రాజేష్‌లను అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందించగా స్థానికులు సైతం అధికారులను అభినందించడం విశేషం.

ప్రక్షాళన దిశగా డీఎంహెచ్‌ఓ కార్యాలయం

- గత డీఎంహెచ్‌ఓను ప్రభుత్వానికి సరెండర్ చేసిన కలెక్టర్
- తాజాగా మరికొంత మంది సిబ్బందిపై చర్యలకు రంగం సిద్ధం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ పనితీరుపై పలు ఆరోపణలు రావడంతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి కార్యాలయ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించారు. స్పందన కార్యక్రమానికి పలు మార్లు గైర్హాజరవడం, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సక్రమంగా నివేదికలు అందించకపోవడం, గత డీఎంహెచ్‌ఓపై అనేక ఆరోపణలు రావడంతో తక్షణమే ఆమెను ప్రభుత్వానికి సరెండర్ చేశారు. వైద్య ఆరోగ్య శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తిస్థాయిలో దృష్టి సారించి అన్ని సదుపాయాలు కల్పిస్తున్న సంగతి తెలిసిందే. జిల్లా ఆసుపత్రులను అభివృద్ధి చేయడంతో పాటు వైఎస్సార్ అర్బన్, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లను కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మిస్తున్నారు. శాఖలో అన్ని పోస్టులను ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ వస్తున్నారు. ఈ సమయంలో కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వైద్య ఆరోగ్య శాఖకు చెడ్డపేరు వస్తుండటంపై జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డి సీరియస్ అయ్యారు. ఇటీవల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పలు నిధులకు సంబంధించిన ఫైల్స్, రిక్రూట్‌మెంట్ సంబంధించిన ఫైల్స్ మాయమైనట్లు ఆరోపణలు వచ్చాయి. కార్యాలయ ఉద్యోగులు సైతం వాటిని సకాలంలో వెతికి కలెక్టర్ కార్యాలయానికి పంపించలేదు. అంతేకాకుండా పలు ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయి. ముఖ్యంగా కోవిడ్ బిల్స్ ప్రభుత్వం విడుదల చేసి ఏడాది కావస్తున్నా వాటిని కార్యాలయ ఉద్యోగులు, అధికారులు కోవిడ్ కాలంలో పనిచేసిన వైద్యులు, వైద్య సిబ్బంది ఖాతాల్లో జమ చేయలేదు. దీనిపై పలు మార్లు కలెక్టర్ కార్యాలయానికి ఫిర్యాదులు రావడంతో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలకు కలెక్టర్ రంగం సిద్ధం చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు సంబంధిత ఫైళ్లను కలెక్టర్ కార్యాలయానికి పంపించారు. కార్యాలయం పరిపాలన అధికారి, ఆఫీస్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్‌లపై చర్యలకు రంగం సిద్ధమైంది.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపండి

అధికారులతో కలెక్టర్ ఎల్.శివశంకర్

నరసరావుపేట: స్పందనలో వచ్చిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాదు, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంలతో కలిసి కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో నిర్వహించిన స్పందనకు జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రజలు 116 ఫిర్యాదులను అందజేసి పరిష్కరించాలని విన్నవించారు. ప్రజా సమస్యలను విని, పరిశీలించి వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందించి, వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. సమస్యలతో వచ్చే వారిని పదేపదే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమానికి తరలివచ్చిన ప్రజలకు పల్నాడు జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తరఫున బంగారం వ్యాపారి రజనీ కుమార్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్, మండల అధికారులు పాల్గొన్నారు.



స్పందనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్, జేసీ

ప్రత్యేకాధికారులతో సమావేశం..

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్సు హాలులో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా శాఖల ప్రత్యేకాధికారులు, మండల అధికారులతో అంతర్గత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి పథకాలను సకాలంలో పూర్తిచేసి అభివృద్ధి చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. గత వారం ఆయా మండలాల్లో స్పెషల్ ఆఫీసర్స్ చేసిన పల్లెనిద్రపై సమీక్షించారు. ఆయుష్మాన్ భారత్, ఈకేవైసీ త్వరితంగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ కె.వినాయకం, ఆయా శాఖల జిల్లా అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అరికట్టండి..

దాచేపల్లి మండలం మాదినపాడు భట్రుపాలెం శంకరాపురం గ్రామం వద్ద ఎప్పటి నుంచో జరుగుతున్న క్వార్జ్ అక్రమ మైనింగ్‌ను అరికట్టాలి.

– నర్రా పిచ్చయ్య, క్రోసూరు

వేతనాలు అందజేయాలి

జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు వేతనాలను వెంటనే అందజేయాలి. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధిహామీ పనులు 150రోజులు కల్పించాలి.

– మల్లెల చిన్నప్ప, ఉమ్మడి గుంటూరు జిల్లా కో-ఆర్డినేటర్, దళిత బహుజన రిసోర్స్ సెంటర్

సాంకేతిక నైపుణ్యం పెంపొందించుకోవాలి

బాపట్ల అర్బన్: విద్యార్థి దశ నుంచే సాంకేతిక నైపుణ్యత పెంపొందించుకోవాలని విద్యాశాఖ జిల్లా అధికారి పీవీ రామారావు సూచించారు. ఎస్సీఆర్టీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం అక్షరాస్యత, 21వ శతాబ్దపు స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమం ఏబీఎం పాఠశాలలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో తొమ్మిదో తరగతి బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు.

స్పందన అర్జీలపై తక్షణమే స్పందించాలి

- జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి
- ఎస్పీ స్పందనకు 42 అర్జీలు

నరసరావుపేట: స్పందనకు వచ్చే అర్జీలపై తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ వై.రవి శంకర్‌రెడ్డి ఆదేశించారు. స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందు మాధవ్‌తో కలసి జిల్లా ఎస్పీ స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుదారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా సదరు ఫిర్యాదులను పరిష్కరించడానికి కృషి చేయాలని సూచించారు. కుటుంబ, ఆర్థిక, ఆస్తి వివాదాలు ఆయా సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ప్రజల నుంచి వస్తున్నట్లు వివరించారు. 42 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. స్పందన వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయసహకారాలు అందించారు.



బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి వారితో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నా ఇంటిని కూల్చేశారు..

నా మరిది కొడుకులే నా ఇంటిని కూల్చివేశారు..వారిపై చర్యలు తీసుకోవాలని అర్జీ అందించారు.
– దాసరి నాగమణి, దాచేపల్లి ఇందిరాకాలనీ

దాడిచేసిన వారిపై చర్య తీసుకోవాలి

పట్టణంలో నివాసం ఉంటున్న కొల్లిపర బాలాజీ ఇంటిపై మద్యం మత్తులో ఆదివారం అర్ధరాత్రి రాళ్లు, కర్రలతో దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి.
– ఎం.శ్రీను, షేక్ మస్తాన్‌వలి, గోదాజాన్‌పాల్


ఎస్పీ వద్దకు అర్జీదారులను తీసుకెళ్తున్న సిబ్బంది

అనాథ కవలలకు ఆర్థిక సాయం

నరసరావుపేట: స్థానిక పెద్దచెరువు ఇంటిగ్రేటెడ్ ఎయిడెడ్ పాఠశాలల్లో నాలుగో తరగతి చదువుతున్న చెవిటి, మూగ అనాథ కవల పిల్లలైన సయ్యద్ జానీబాషా, సయ్యద్ జానీబేగంలకు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జాయింట్ కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సోమవారం కలెక్టరేట్‌లో రూ.25వేలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈనెల తొమ్మిదో తేదీన మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెడికల్ క్యాంపులో ఎయిడెడ్ పాఠశాల అధ్యాపకురాలు, కవల పిల్లలైనా సయ్యద్ జానీ బాషా, సయ్యద్ జానీ బేగంలకు పుస్తకాలు, దుస్తులు కొనుగోలు కోసం ఆర్థిక సహాయం చేయాల్సిందిగా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఆర్థిక సహాయం అందజేశారు.


కలెక్టరేట్‌లో ఆర్థిక సహాయం అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, పక్కన జేసీ శ్యాంప్రసాద్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డీఎంహెచ్‌ఓ శోభారాణి
- కొచ్చర్ల తండా సందర్శన

ఈపూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి డీఎంహెచ్‌ఓ శోభారాణి సూచించారు. మండలంలోని కొచ్చర్ల తండా జ్వరాల బారిన పడడంతో సోమవారం తండాను సందర్శించారు. తండావాసులతో మాట్లాడారు. జ్వరాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వైద్యసిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొచ్చర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. వైద్యసిబ్బందితో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి కోపెల దేవరాజు, వీఆర్‌ఓ శామ్యూల్, పీహెచ్‌సీ డాక్టర్ నాగేంద్ర బాబు, సూపర్‌వైజర్ సాంబశివరావు పాల్గొన్నారు.


కొచ్చర్ల తండాలో వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ శోభారాణి

దివ్యాంగులకు వాహనాలు అందించాలి

బాపట్ల అర్బన్: దివ్యాంగులకు మూడు చక్రాల మోటార్ వాహనాలు పంపిణీ చేయాలని కోరుతూ జిల్లా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు చల్లా రామయ్య కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేశాడు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందనలో అర్జీ అందించారు. అనంతరం చల్లా రామయ్య విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ద్వారా అర్హులైన దివ్యాంగులందరికీ మూడు చక్రాల మోటార్ వాహనాలను ఉచితంగా అందించాలని కోరినట్లు చెప్పారు. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. 60 మందికి పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ దివ్యాంగుల నాయకులు గుంజి ఏడుకొండలు, బొడ్డు శ్రీను, సుంకర శ్రీనివాసరావు, కొండమ్మ, బాలాజీ ఉన్నారు.


కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతిపత్రం అందజేస్తున్న చల్లా రామయ్య

ఫ్యాషన్ డిజైనర్స్‌తో గిరిజనులకు ప్రత్యేక శిక్షణ

విజయపురిసౌత్: జాతీయ ఫ్యాషన్ డిజైనింగ్‌లో గిరిజన మహిళలకు కొత్తరకం డిజైన్లు రూపొందించేందుకు 2 నెలల ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కేంద్ర టెక్స్‌టైల్స్ అండ్ హ్యాండిక్రాఫ్ట్స్ ఆంధ్రప్రదేశ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వి.అపర్ణలక్ష్మి తెలిపారు. సోమవారం స్థానిక శ్రీ సీతారామాలయంలో గిరిజనులకు హ్యాండిక్రాఫ్ట్స్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విజయవాడ నుంచి ఢిల్లీ వరకు ఎగ్జిబిషన్స్‌లో ఉచితంగా స్టాల్స్ ఏర్పాటుకు సహకరించనున్నట్లు పేర్కొన్నారు. దారి ఖర్చులతో పాటు ఉత్పత్తులను అమ్ముకొని ఆర్థికంగా ఎదిగేందుకు సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు. పథకాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అనంతరం సెమినార్‌లో పాల్గొన్న పలువురు అధికారులు బంజార ఎంబ్రాయిడింగ్ చేసే గిరిజన హస్త కళాకారులకు ప్రొడక్షన్స్ బ్రాండింగ్, ప్రభుత్వ పథకాలు మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గిరిజనులు తయారు చేసిన వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో హ్యాండిక్రాఫ్ట్ ప్రొడక్షన్ ఆఫీసర్ ఎం.సువర్చల, చేనేత, జౌళి అభివృద్ధి అధికారి బి.శ్రీధర్ బాబు, సీసీఓ ఐఎస్ రావు, హ్యాండిక్రాఫ్ట్స్ ప్రొడక్షన్ అండ్ కంట్రోల్ అడ్వైజర్ పీడీ సుధీర్ కుమార్ ఉన్నారు.


గిరిజనులు తయారు చేసిన మెటీరియల్‌ను పరిశీలిస్తున్న అపర్ణలక్ష్మి

కేవీలో ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తెనాలిఅర్బన్: తెనాలి చినరావూరులోని కేంద్రీయ విద్యాలయలో తాత్కాలిక ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు ప్రిన్సిపాల్ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీలో హిందీ, ఇంగ్లిష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ, టీజీటీలో హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం, సోషల్ సైన్స్, మ్యాథ్స్, పీఆర్టీ, స్టాఫ్ నర్సు, కోచ్ ఫర్ స్పోర్ట్స్, కౌన్సిలర్, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. సర్టిఫికెట్లతో పాటు దరఖాస్తు, బయోడేటా ఫారాలు తీసుకురావాలని తెలిపారు. వివరాలకు https://tenali.kvs.ac.in లో సంప్రదించాలన్నారు.

28, 29 తేదీల్లో ఢిల్లీలో ఆందోళనలు

నెహ్రూనగర్(గుంటూరు): జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలని, చట్ట సభల్లో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీల రిజర్వేషన్లను పెంచాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 28, 29వ తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలియజేశారు. సోమవారం చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీల కులగణన చేపడతామని మాట ఇచ్చిన బీజేపీ ప్రభుత్వం హామీని విస్మరించిందన్నారు. తొమ్మిదేళ్లుగా బీసీల సంక్షేమం కోసం కేంద్రం చేసింది శూన్యమన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమని పేర్కొన్నారు. సంఘ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ ఇటీవల ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశంలో బీసీల కులగణన చేస్తామని, చట్ట సభల్లో రిజర్వేషన్ కల్పిస్తామని తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. సమావేశంలో సంఘ నాయకులు నిమ్మల శేషయ్య, అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కొల్లి కొండ వెంకటసుబ్రహ్మణ్యం, ముప్పాన వెంకటేశ్వర్లు, ద్వారకా శ్రీను, వెంకట్రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

చిరుధాన్యాలతో చక్కని ఆరోగ్యం

గుంటూరు వెస్ట్: చక్కని ఆరోగ్యం కోసం రోజువారీ ఆహారంలో చిరుధాన్యాల వినియోగం పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్‌ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషణ పక్వాడా పక్షోత్సవ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఏప్రిల్ 3 వరకు జరుగుతుందన్నారు. చిరుధాన్యాలు వినియోగం పెంచడం, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడం ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. బాలబాలికలు, యువతులు, గర్భిణులు, రక్తహీనత ఉన్న వారు మిల్లెట్లను ఆహారంగా తీసుకోవడం ద్వారా చక్కని ఫలితాలు పొందే అవకాశముంటుందన్నారు. ఈ ఏడాదిని ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అంతర్జాతీయ మిల్లెట్స్‌గా ప్రకటించిందన్నారు. దీనిపై అధికారులు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఐసీడీఎస్ పీడీ మనోరంజని, జిల్లా అధికారులు పరిశీలించారు.


జ్యోతి వెలిగింస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నారులు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పోషణ్ పక్వాడా–2023 పక్షోత్సవాలను ఆమె ప్రారంభించారు. హెనీక్రిస్టినా మాట్లాడుతూ పక్షోత్సవాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఉద్యోగినులు, సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి హత్యకేసులో కుమారుడికి జీవిత ఖైదు

మార్టూరు: వ్యసనాలకు లోనై అడిగినంత డబ్బు ఇవ్వలేదనే కారణంతో కన్న తండ్రిని హత్య చేసిన కుమారుడికి కోర్టు జీవిత ఖైదు, జరిమానా విధించింది. సోమవారం మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్ తెలిపిన వివరాల మేరకు.. బొబ్బేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన బత్తుల పరశురామారావు(71) పోలీసుశాఖలో ఏఎస్‌ఐగా పనిచేసి రిటైరై ఇంటి దగ్గరే ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు సంతానం. వారిలో చివరి వాడైన బత్తుల సురేష్‌బాబు వ్యసనాలకు బానిసై జులాయిగా తిరుగుతూ తండ్రికి వచ్చే పెన్షన్ డబ్బు వాడుకుంటూ ఉండేవాడు. ఈ క్రమంలో 2020 జూన్ 13న ఉదయం 6.30 గంటలకు సురేష్‌బాబు తనకు రూ.30 వేలు నగదు కావాలని అడుగగా అందుకు తండ్రి నిరాకరించాడు. ఆగ్రహించిన సురేష్‌బాబు అందుబాటులో ఉన్న జామాయిల్ కర్రతో తండ్రిపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దాడిలో పరశురామారావు అక్కడికక్కడే మృతి చెందాడు. అప్పటి ఇంకొల్లు సీఐ ఆర్ రాంబాబు ఆదేశాలతో ఏఎస్ఐ వెంకటేశ్వరరావు సురేష్‌బాబును అదుపులోనికి తీసుకొని కేసు నమోదు చేశారు. ఒంగోలు ఏడో అదనపు అదనపు జ్యుడిషియల్ కోర్టులో రెండేళ్లకు పైగా వాదప్రతివాదనలు పూర్తయ్యాక న్యాయమూర్తి డీ అమ్మనరాజు సాక్ష్యాధారాలను పరిశీలించి ముద్దాయి సురేష్‌బాబును దోషిగా నిర్ణయించి సోమవారం అతనికి జీవిత ఖైదుతో పాటు రూ.2 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కేసును త్వరితగతిన దర్యాప్తు చేసి ముద్దాయికి శిక్ష పడేలా చేసిన పోలీసు అధికారులను బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

ఫొటోగ్రాఫర్ మహాలక్ష్మికి నంది అవార్డు

రాజమహేంద్రవరంలో అవార్డు అందజేసిన సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి

నరసరావుపేట: నరసరావుపేటకు చెందిన మహిళా ఫొటోగ్రాఫర్ కారచోల మహాలక్ష్మి కేంద్ర ప్రభుత్వ నంది అవార్డు పురస్కారం పొందారు. ఉగాది పండుగ సందర్భంగా సోమవారం రాజమహేంద్రవరంలో కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ రంగాలలో అత్యుత్తమ సేవలను అందించిన వారికి నంది పురస్కారాలను అందజేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక సభ్యురాలు డాక్టర్ ఎస్‌పీ భారతి అధ్యక్షత వహించారు. అవార్డుల ప్రధానోత్సవ వేడుకకు ముఖ్యఅతిథిగా ప్రముఖ రచయిత, నటుడు ఆర్.నారాయణమూర్తి హాజరయ్యారు. నరసరావుపేటకు చెందిన కారచోల మహాలక్ష్మి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి మహిళా ఫొటోగ్రాఫర్‌గా ప్రజలకు అందించిన అత్యుత్తమ సేవలను కేంద్ర ప్రభుత్వం కొనియాడుతూ ఆమెకు నంది అవార్డు పురస్కారాన్ని ప్రకటించింది.


సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి నుంచి నంది పురస్కారాన్ని స్వీకరిస్తున్న మహాలక్ష్మి

పిడుగురాళ్ల మున్సిపల్ చైర్మన్‌కు డాక్టరేట్

పిడుగురాళ్ల: మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావుకు ఏషియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ కల్చర్ అకాడమీ బిజినెస్ కేటగిరిలో డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసింది. ఏపీఈడబ్ల్యూఐడీసీ, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ చింతా వెంకట రామారావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆయనను దుశాలువాతతో సన్మానించారు. చింతా వెంకట రామారావు మాట్లాడుతూ బిజినెస్‌లోనే కాకుండా పట్టణంలోని అందరితో కలసి మెలిసి ఉండటం జరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు మాట్లాడుతూ తనకు ఈ అవార్డుకు ఎంపిక చేసిన సంస్థకు, రావటానికి కృషి చేసిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఉన్నం ఆంజనేయులు, యార్డ్ డైరెక్టర్ పంతంగి అమర్, జూలకంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావును సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రణాళికతో ఉన్నత చదువుల వైపు

అపుస్మా జిల్లా అధ్యక్షుడు బి.పోతిరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి దశను అధిగమించి ఇంటర్మీడియెట్‌లోకి ప్రవేశించే విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత చదువుల దిశగా ముందుకు వెళ్లాలని ఆంధ్రప్రదేశ్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా అధ్యక్షుడు బి.పోతిరెడ్డి పేర్కొన్నారు. నగరంపాలెంలోని ప్రజ్ఞ స్కూల్లో సోమవారం టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎన్.చక్రనాగ్ మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలుపుకుంటూ, విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలిగి ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. టెన్త్ తరువాత ఇంటర్‌లో చేరే విద్యార్థులు తమకు నచ్చిన ఎంపీసీ, బైపీసీ తదితర కోర్సులను ఎంపిక చేసుకుని, వాటిపై దృష్టి సారించేందుకు అవసరమైన నైతిక స్థైర్యాన్ని అందించామని వివరించారు. ఇంటర్ దశలో క్రమశిక్షణతో ఎంచుకున్న సబ్జెక్టులలో ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు కలిసి చదువుకున్న విద్యార్థులు తమ సహచరులను వీడుతున్నామనే బాధతో భావోద్వేగానికి గురయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అకౌంట్ అప్‌డేట్ పేరుతో ఘరానా మోసం

- గతంలో యూపీఐ పేమెంట్స్ సంస్థలో పనిచేసిన వ్యక్తిగా గుర్తింపు
- నిమిషాల్లో నగదు మాయం

తాడేపల్లి రూరల్: పలు షాపుల యజమానుల ఖాతాల్లోని డబ్బును ఓ మోసకారి మాయం చేసిన సంఘటన సోమవారం ఉండవల్లి నాలుగు రోడ్ల సెంటర్ కూడలిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల మేరకు.. ఉండవల్లి అమరావతి రోడ్డులో నిత్యం రద్దీగా ఉండే నాలుగు షాపులకు ఓ వ్యక్తి వెళ్లి నేను భారత్ పే నుంచి వచ్చానని, తన పేరు దుర్గా ఫణికుమార్ ప్రసాద్ అని ఐడీ కార్డు చూపించాడు. భారత్‌పే అకౌంట్ అప్‌డేట్ చేయాలంటూ వారి ఫోన్ తీసుకుని ఆ ఖాతాల్లో ఉన్న నగదును తన అకౌంట్‌కు పంపించుకున్నాడు. వెంటనే ఫోన్ ఇచ్చేసి, అర్ధగంటలో మీ ఫోన్ ఆన్ చేస్తే అప్‌డేట్ అవుతుందని చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయాడు. అలా నలుగురు వ్యాపారుల నుంచి రూ.25 వేలు తన ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేసుకుని వెళ్లిపోయాడు. మోసపోయామని గుర్తించిన వ్యాపారులు భారత్ పే సంస్థ ప్రతినిధులకు ఫోన్ చేయగా అతను మా వద్ద ఉద్యోగం మానేసి 15 రోజులు అవుతోందని తెలిపారు. మేము చేయగలిగింది ఏమీ లేదన్నారు. సదరు ఉద్యోగి దగ్గర ఐడీ కార్డును స్వాధీనం చేసుకోకపోవడం వల్లే తాము నమ్మాల్సి వచ్చిందని వ్యాపారస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.